

జల వనరుల శాఖకు రూ.44.05 కోట్లు నష్టం

అత్యవసర పనులకు రూ.3.12 కోట్లు అవసరం

- అధికారుల ప్రతిపాదనలు

విశాఖపట్నం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తీవ్ర వాయుగుండం ప్రభావంతో కురిసిన భారీవర్షాలకు ఉమ్మడి జిల్లాలో జల వనరుల శాఖకు చెందిన పలు నిర్మాణాలు దెబ్బతిన్నాయి. భారీ, మధ్య, చిన్నతరహా ప్రాజెక్టులు, చెరువులకు రూ.44.05 కోట్లు నష్టం వాటిల్లినట్టు ప్రాథమికంగా అంచనా వేశారు. గండ్లు పూడ్చడం, ఇతరత్రా మరమ్మతులు మొత్తం 136 పనులు చేపట్టాలని గుర్తించారు. ఇందులో అత్యవసరమైనవి చేపట్టేందుకు రూ.3.12 కోట్లు అవసరమని ప్రభుత్వానికి నివేదిక పంపించారు. ఇంకా శాశ్వత ప్రాతిపదికగా పనులు చేపట్టడానికి మరో రూ.40.92 కోట్లు అవసరమని ప్రతిపాదనల్లో పొందుపరిచారు.

విశాఖ జిల్లాలో చిన్న నీటి పారుదల విభాగంలో 18 పనులకు సంబంధించి రూ.3.96 కోట్ల నష్టం వాటిల్లింది. దెబ్బతిన్న పనుల మరమ్మతులకు తాత్కాలికంగా రూ.25.55 లక్షలు, శాశ్వత పనులకు రూ.3.71 కోట్లు అవసరమని అంచనా వేశారు. భారీ నీటి పారుదల విభాగంలో రూ.2.02 కోట్ల నష్టం వాటిల్లగా తాత్కాలిక మరమ్మతులకు రూ.2.5 లక్షలు, శాశ్వత పనులు కింద రూ.2 కోట్లు అవసరమని ప్రతిపాదించారు. అనకాపల్లి జిల్లాలో మైనర్ ఇరిగేషన్ విభాగంలో నర్సీపట్నం డివిజన్ పరిధిలో రూ.26.04 కోట్లు, చోడవరం వాటర్‌షెడ్ డివిజన్‌లో రూ.9.37 కోట్లు నష్టం వాటిల్లింది. నర్సీపట్నం డివిజన్‌లో అత్యవసర పనులకు రూ.2.14 కోట్లు, శాశ్వత పనులకు రూ.23.9 కోట్లు..మొత్తం రూ.26.04 కోట్లు, చోడవరం డివిజన్‌లో అత్యవసర పనులకు రూ.0.40 కోట్లు, శాశ్వత పనులకు రూ.8.97 కోట్లు వెరసి రూ.9.37 కోట్లు కావాలని ప్రతిపాదించారు. మేజర్ ఇరిగేషన్ కింద తాండవ ప్రాజెక్టుకు అత్యవసరంగా రూ.1.8 లక్షలు, శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టేందుకు రూ.1.08 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపించారు. అలాగే మధ్య తరహా నీటి పారుదల విభాగం పరిధిలో చోడవరం ప్రాంతంలోని రైవాడ, కోనాం, పెద్దేరు రిజర్వాయర్లకు అత్యవసర పనులకు రూ.28.6 లక్షలు, శాశ్వత ప్రాతిపదికగా పనులు చేపట్టేందుకు రూ.1.24 కోట్లు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదించారు.

గోవాడ షుగర్స్ మహాజన సభ 28న

డిసెంబరులో చెరకు క్రషింగ్ ప్రారంభం

- నేటి నుంచి విధుల్లోకి కార్మికులు
- ఓవర్‌హాలింగ్ పనులు మొదలు
- 10 వేల ఎకరాల్లో చెరకు.. రైతులతో అగ్రిమెంట్
- రెండు లక్షల టన్నుల చెరకు క్రషింగ్ చేయాలని లక్ష్యం
- గత సీజన్ బకాయిలు త్వరలో చెల్లింపు
- ఫ్యాక్టరీ ఎండీ వి.సన్యాసినాయుడు



సన్యాసినాయుడు, గోవాడ షుగర్స్ ఎండీ

చోడవరం, సెప్టెంబరు 11: గోవాడ షుగర్ ఫ్యాక్టరీ మహాజన సభను ఈ నెల 28వ తేదీన నిర్వహించాలని నిర్ణయించినట్టు ఎండీ వి.సన్యాసినాయుడు చెప్పారు. బుధవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఫ్యాక్టరీ అభివృద్ధికి చేపటవలసిన చర్యలపై మహాజన సభలో చర్చిస్తామని తెలిపారు. 2024-25 క్రషింగ్ సీజన్‌ను డిసెంబరులో ప్రారంభించనున్నట్టు ప్రకటించారు. క్రషింగ్ ప్రారంభానికి అవసరమైన ముందస్తు చర్యలు ఇప్పటికే ప్రారంభించామన్నారు. ఓవర్‌హాలింగ్ పనులు ఈ నెల 12వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ పనుల కోసం కార్మికులను విధుల్లోకి(రీకాల్) తీసుకునేందుకు చైర్మన్ అయిన కలెక్టర్ అనుమతి ఇచ్చారని, గురువారం నుంచి కార్మికులు విధులకు హాజరవుతామరని ఆయన చెప్పారు.

ఫ్యాక్టరీ పరిధిలో 10 వేల ఎకరాల్లో చెరకు

రానున్న క్రషింగ్ సీజన్‌లో ఫ్యాక్టరీకి చెరకు సరఫరా చేసేందుకు 10 వేల ఎకరాల్లో మొక్క, కార్శీ తోటలకు సంబంధించి రైతులతో ఒప్పందాలు చేసుకున్నామని, ఇంకా తుమ్మపాల, ఏటికొప్పాక, తాండవ ఫ్యాక్టరీల పరిధిలోని చెరకును కూడా గోవాడలో క్రషింగ్ చేయడానికి కృషి చేస్తామని ఎండీ సన్యాసినాయుడు చెప్పారు. రానున్న సీజన్‌లో రెండు లక్షల టన్నుల చెరకు క్రషింగ్ అవుతుందని అంచనా వేస్తున్నామన్నారు.

చెరకు రైతులకు త్వరలో బకాయిలు చెల్లింపు

గత క్రషింగ్ సీజన్‌కు సంబంధించి చెరకు రైతులకు టన్నుకు రూ.2,500 చొప్పున చెల్లించామని, ఇంకా టన్నుకు రూ.419.75 చొప్పున రూ.7.16 కోట్లు, రవాణా ఛార్జీల బకాయిలు మరో రూ.46 లక్షలు చెల్లించాల్సి వుందన్నారు. గత సీజన్‌లో ఉత్పత్తి చేసిన పంచదార, మొలాసిస్‌లను విక్రయించి చెరకు రైతులకు బకాయిలు చెల్లించేదుకు ... మిగతా 8వ పేజీలో

నదుల గట్లపై నిర్లక్ష్యం

నిర్వహణ, పటిష్ఠతను పట్టించుకోని గత వైసీపీ ప్రభుత్వం

- కోతకు గురై, గండ్లు పడి.. బలహీనంగా మారిన కరకట్టలు
- నదుల్లో వరద ఉధృతి పెరిగితే బిక్కుబిక్కుమంటున్న ప్రజలు



పీఎస్‌పేట వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్దేరు నది (ఫైల్ ఫొటో)

చోడవరం, సెప్టెంబరు 11: భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేస్తే చాలు.. చోడవరం, మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గాల్లో నదుల వెంబడి వున్న గ్రామాల ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. పలుచోట్ల నదుల గట్లు బలహీనంగా వుండడం, గతంలో కోతకు గురైన లేదా గండ్లు పడినచోట పటిష్ఠ చర్యలు చేపట్టకపోవడంతో వరద ఉధృతి అధికంగా వుంటే గండ్లు పడే ప్రమాదం వుందని ఆందోళన చెందుతున్నారు.

బంగాళాఖాతంలో అల్పపీడనాలు, వాయుగుండాలు ఏర్పడి, కొన్నిసార్లు తుపాన్లుగా మారుతుంటాయి. దీంతో భారీ వర్షాలు పడుతుంటాయి. ముఖ్యంగా జిల్లాను ఆనుకుని వున్న అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో కుండపోతగా వాన కురుస్తుంది. దీంతో అనకాపల్లి జిల్లాలో రైవాడ, పెద్దేరు, కోనాం, కల్యాణపులోవ జలాశయాల్లోకి భారీగా వరద నీరు చేరుతుంది. ఇవన్నీ చిన్నతరహా నీటిపారుదల ప్రాజెక్టులు కావడంతో త్వరగానే నిండిపోతుంటాయి. దీంతో రిజర్వాయర్ల గేట్లు ఎత్తి అదనపు నీటిని దిగువకు విడుదల చేస్తుంటారు. గత వారం తీవ్రవాయుగుండం ప్రభావంతో కుండపోతగా వర్షం పడడంతో జలాశయాలు నిండిపోయి, గేట్లు ఎత్తాల్సి వచ్చింది. దీంతో శారదా, పెద్దేరు, బొడ్డేరు, తాచేరు, సర్పా, తదితర నదులు వరదతో ఉప్పొంగాయి.



గత ఏడాది డిసెంబరు మొదటి వారంలో తుఫాన్ వర్షాలకు రామజోగిపాలెం సమీపంలో కోతకు గురైన పెద్దేరు నది గట్టు

ఇరువైపులా గట్లను తాకుతూ ప్రమాదకర స్థాయిలో వరద నీరు ప్రవహించింది. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని నదులకు ఇరువైపులా వున్న గ్రామాల ప్రజలు, పొలాలు ఉన్న రైతులు తీవ్ర భయాందోళన చెందారు. శారదా నది పక్కనున్న గవరవరం, లక్కవరం, జుత్తాడ, గజపతినగరం, భోగాపురం, ముద్దుర్తి; పెద్దేరు, బొడ్డేరు నదుల పక్కనున్న గౌరీపట్నం, పీఎస్‌పేట, బెన్నవోలు, జన్నవరం, చాకిపల్లి, కన్నంపాలెం, తిమ్మనపాలెం, రామజోగిపాలెం, తదితర గ్రామాల వద్ద ఇసుక తరలించేందుకు విచ్చలవిడిగా నది గట్లను అక్రమార్కులు తవ్వేయడంతో వల్ల బలహీనంగా మారాయి. గత తెలుగుదేశం హయాంలో నదిగట్లను ఉపాధి నిధులతో పటిష్ఠం చేశారు. అయితే గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జలవనరుల శాఖకు నిధుల కేటాయింపులు లేకపోవడంతో నదుల గట్ల పటిష్ఠత పనులు చేయలేదు. ఏటా భారీ వర్షాలకు నదుల్లో వరద ఉధృతి పెరిగి, గట్లకు గండ్లుపడి పంటపొలాలను ముంచెత్తడం ఆనవాయితీగా మారింది. గత ఏడాది డిసెంబరులో సంభవించిన తుఫాన్‌కు భారీ వర్షాలు కురిసి పెద్దేరు నది పోటెత్తింది. వరద ఉధృతికి పీఎస్‌పేట కాటా సమీపంలోని పడిన గండ్లకు పీఎస్‌పేట, చాకిపల్లి, జన్నవరం, బెన్నవోలు గ్రామాలకు చెందిన వరి, చెరకు పంటలు నీటమునిగాయి. గట్లకు పడిన గండ్లను తూతూమంత్రంగా పూడ్చడంతో, ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నదులు పొంగడంతో మళ్లీ ఎక్కడ గండ్లు పడతాయోనని రైతులు ఆందోళన చెందారు. ఐదేళ్ల క్రితం వరకు ఏటా వర్షాకాలంలో నది గట్ల వెంబడి ఇరిగేషన్ అధికారులు పర్యటించి గట్ల పరిస్థితిని పరిశీలించేవారు. వేసవిలో నది గట్లను పటిష్ఠం చేసే వారు. అయితే వైసీపీ పాలనలో నదిగట్ల పరిస్థితి దయనీయంగా మారింది. నీటిసంఘాలు నిర్వీర్యం కావడంతో నది గట్ల దుస్థితిని పట్టించుకునేవారు లేకుండాపోయారు.

ముంపు పొలాలను పరిశీలించిన కలెక్టర్



పంట పొలాలను పరిశీలించేందుకు వెళ్తున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

- కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని ఆదేశం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 11 : ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా నీట మునిగిన పంట పొలాలను జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ బుధవారం పరిశీలించారు. శంకరం, బొజ్జన్నకొండ, అనకాపల్లి ఆవఖండం, కొప్పాక, రాజుపాలెం ప్రాంతాల్లో పర్యటించారు. పొలాల్లో ఉన్న నీటిని త్వరగా బయటకు పంపేందుకు కాలువల్లో పూడికతీత పనులు త్వరితగతిన చేపట్టాలని నీటి పారుదల శాఖ అధికారులకు సూచించారు. నీటి ముంపు నుంచి బయట పడిన పంటను కాపాడుకునేందుకు రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట నీటిపారుదల, వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు ఉన్నారు.

బాక్సింగ్ రింగ్‌కు బ్రేకులు

నిలిచిపోయిన నిర్మాణ పనులు

- స్కేటింగ్ రింక్ స్థలంలో బాక్సింగ్ రింగ్ నిర్మించడంపై స్పీకర్ ఆగ్రహం?
- నిధులను ఇతర ప్రాజెక్టులకు వినియోగించాలని కలెక్టర్ ఆదేశం



ఆగిపోయిన బాక్సింగ్ రింగ్ నిర్మాణ పనులు

నర్సీపట్నం, సెప్టెంబరు 11: స్థానిక మునిసిపాలిటీలో బాక్సింగ్ రింగ్ ఇండోర్ హాల్ పనులు నిలిచిపోయాయి. స్కేటింగ్ రింక్ ఆవరణలో ఉన్న స్థలంలో బాక్సింగ్ రింగ్, ఇండోర్ హాల్ నిర్మాణం చేయడం పట్ల స్థానిక ఎమ్మెల్యే, శాసనసభ స్పీకర్ అయిన చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. దీంతో సంబంధిత అధికారులు పనులు ఆపేశారని సమాచారం.

బాక్సింగ్ క్రీడాకారులు శిక్షణ తీసుకోవడానికి నర్సీపట్నంలో రింగ్, ఇండోర్ హాల్ నిర్మాణం కోసం 2023లో అప్పటి జిల్లా కలెక్టర్ రూ.60 లక్షలు మంజూరు చేశారు. బాక్సింగ్ రింగ్, ఇండోర్ హాల్ నిర్మాణం కోసం పట్టణంలో పలు ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. ఎక్కడా సరైన స్థలం లభించకపోవడంతో ఆర్‌అండ్‌బీ అధికారులు ఏరియా ఆస్పత్రి ఎదురుగా ఉన్న స్కేటింగ్ రింక్ ఆవరణలోని ఆరు సెంట్ల ఖాళీ స్థలంలో బాక్సింగ్ రింగ్, హాల్ నిర్మాణ పనులను ఈ ఏడాది ఫిబ్రవరిలో మొదలు పెట్టారు. పునాదుల గోతులు తవ్వి, పిల్లర్ల పనులు చేపట్టారు. బాక్సింగ్ రింగ్, ఇతర సామగ్రి సరఫరా టెండర్‌ను నర్సీపట్నంలోని జీఆర్ స్పోర్ట్స్ దక్కించుకుంది. తరువాత ఎన్నికలు జరిగి, కూటమి ప్రభుత్వం ఏర్పడిన విషయం తెలిసిందే. కాగా రుత్తల లచ్చాపాత్రుడు నందన వనంలో గత ... మిగతా 8వ పేజీలో



ఎన్టీఆర్ మినీ స్టేడియంలో శిక్షణ పొందుతున్న బాక్సింగ్ క్రీడాకారులు

పెద్దేరులో మహిళ గల్లంతు



జనపరెడ్డి సుబ్బలక్ష్మి (ఫైల్‌ఫొటో)

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 11: మండలంలోని వడ్డాది వద్ద పెద్దేరు నదిలో జారిపడి మహిళ గల్లంతయ్యారు. ఆమె ఆచూకీ లభించక పోవడంతో కుటుంబ సభ్యులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటకు సంబం ధించి వివరాలిలా వున్నాయి. వడ్డాది గ్రామానికి చెందిన జనపరెడ్డి సుబ్బలక్ష్మి(58), తన సోదరి బద్ది విజయలక్ష్మితో కలసి కస్పా కాలువ పక్కనగల దాడి వీధిలో నివాసం ఉంటున్నారు. మంగళవారం రాత్రి ఇద్దరూ కలిసి కాలువ గట్టుపై బహిర్భూమికి వెళ్లారు. కాలువ గట్టు పక్కనే పెద్దేరు నది ఉధృతంగా ప్రవహిస్తున్నది. చీకటిగా వుండడంతో సుబ్బలక్ష్మి కాలు జారి నదిలో పడిపోయి నీటిలో కొట్టుకుపోయింది. బంధువులు, స్థానికులు గాలించినప్పటికీ ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో బద్ది విజయలక్ష్మి బుధవారం తహసీల్దార్‌కు, ఎస్‌ఐకి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్‌ఐ డి.ఈశ్వరరావు తెలిపారు.

పలువురు ఎస్‌ఐలకు స్థానచలనం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 11: జిల్లాలో పలువురు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ ఎం.దీపిక బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మాకవరపాలెం ఎస్‌ఐ పి.రామకృష్ణారావును రోలుగుంటకు, అనకాపల్లి పీసీఆర్‌లో ఉన్న ఎం.శ్రీనివాస్‌ను కొత్తకోటకు, కె.కోటపాడు నుంచి డి.లక్ష్మీనారాయణను ఎ.కోడూరుకు, ఉమెన్ పీఎస్ (అటాచ్ ఐటీ కోర్)లో ఉన్న ఎస్‌ఐ ఎం.రఘువర్మను రావికమతం పీఎస్‌కు, ఇక్కడ పనిచేస్తున్న ధనుంజయనాయుడును అనకాపల్లి జిల్లా వీఆర్‌కు బదిలీ చేశారు. అనకాపల్లి టౌన్ పీఎస్ (అటాచ్డ్ ఉమెన్ పీఎస్)లో ఉన్న ఎస్.రమేశ్‌ను కోటవురట్లకు, ఏఎస్‌ఆర్ జిల్లా హుకుంపేట ఎస్‌ఐ బి.సతీశ్‌ను చీడికాడకు, ఏఎస్‌ఆర్ జిల్లా కొయ్యూరు పీఎస్ నుంచి పి.రాజారావును నర్సీపట్నం రూరల్‌కు, ఎ. కోడూరు ఎస్‌ఐ జె.రమేశ్‌ను అనకాపల్లి జిల్లా వీఆర్‌కు, కొత్తకోట ఎస్‌ఐ కె.లక్ష్మణరావును కశింకోటకు, ఇక్కడి ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డిని అనకాపల్లి జిల్లా వీఆర్‌కు, కోటవురట్ల ఎస్‌ఐ బి.రమణయ్యను సీఎంఎస్ అనకాపల్లి జిల్లాకు, డీసీఆర్‌బీ ఎస్‌ఐ వి.నాగకార్తీక్‌ను చోడవరం-2 పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు.

కారిడార్ పనులు అడ్డగింత

న్యాయం చేయాలని నిర్వాసితులు డిమాండ్

- పరిహారం, ప్యాకేజీ ఇవ్వకుండా పనులు ఎలా చేస్తారని నిలదీత
- హోం మంత్రి, కలెక్టర్‌తో 17 సమావేశం
- అప్పటి వరకు పనులు ఆపాలని నిర్ణయం





రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న కారిడార్ నిర్వాసిత రైతులు, నాయకులు (ఇన్‌సెట్‌లో) అధికారులతో మాట్లాడుతున్న ఆందోళనకారులు

నక్కపల్లి, సెప్టెంబరు 11: విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం భూములిచ్చిన తమకు పూర్తిస్థాయిలో పరిహారం, ప్యాకేజీ ఇవ్వకుండా పనులు ఎలా చేస్తారంటూ నిర్వాసిత రైతులు ఆందోళన చేపట్టారు. కారిడార్ భూముల్లో పనులను అడ్డుకుంటే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మంగళవారం హెచ్చరించగా, బుధవారం ఉదయం చందనాడ గ్రామంలో వున్న కారిడార్ భూముల్లో యంత్రాలతో తుప్పలు తొలగిస్తున్న విషయం తెలిసి నిర్వాసిత రైతులు పనులు అడ్డగించేందుకు సిద్ధపడ్డారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, సీపీఎం జిల్లాకార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, చందనాడ ఎంపీటీసీ సభ్యుడు గంటా తిరుపతిరావు, సర్పంచ్ తళ్ల రోహిణి భార్గవ్ అక్కడకు చేరుకుని ఆందోళనకారులకు సంఘీభావం ప్రకటించారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో నక్కపల్లి, పాయకరావుపేట సీఐలు కుమారస్వామి, అప్పన్న, ఎస్‌ఐ సన్నిబాబుల నేతృత్వంలో పోలీస్ బలగాలు చేరుకున్నాయి. పనులు ఆపవద్దని ఆందోళన కారులకు తహసీల్దార్ అంబేడ్కర్ విజ్ఞప్తిచేయగా, తమకు న్యాయం చేయకపోతే గతంలో ఇచ్చిన పరిహారాన్ని తిరిగి ఇచ్చేస్తామని, భూములను తమకు అప్పగించాలని నిర్వాసితులు డిమాండ్ చేశారు. మీ సమస్యలపై ఈ నెల 17న హోం మంత్రి అనిత, కలెక్టర్ విజయకృష్ణన్‌తో కృష్ణన్‌తో సమావేశం ఏర్పాటు చేశామని, అక్కడకు వచ్చి సమస్యలు చెప్పాలని తహసీల్దార్, సీఐలు సూచించారు. అయితే అప్పటి వరకు కారిడార్ పనులు ఆపాలని నిర్వాసితులు డిమాండ్ చేశారు. దీంతో అధికారులు ఇక్కడ సమస్యను ఉన్నతాధికారులకు వివరించారు. 17వ తేదీ వరకు పనులు చేపట్టబోమని అధికారులు చెప్పడంతో నిర్వాసితులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం ప్రతినిధులు తళ్ల అప్పలస్వామి, గెడ్డమూరి గోవింద్, సూరకాసుల గోవింద్,వాసుపల్లి రాజు, మడుగుల తాతాజీ, తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో ఇద్దరి అరెస్టు

- రూ.12 లక్షల విలువైన 17 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం

- 7లో

ఫార్మా ఉద్యోగి అదృశ్యం

అడ్మిరాన్ పరిశ్రమ వద్ద కుటుంబీకుల ఆందోళన

- సీసీ టీవీ ఫుటేజీ పరిశీలన
- పరిశ్రమ నుంచి బయటకు వెళ్లినట్టు రికార్డుకాని వైనం
- లోపల ఏదో జరిగిందని ఆరోపణ
- పోలీసులకు ఫిర్యాదు



ఆర్.సూర్యనారాయణ (ఫైల్‌ఫొటో)

పరవాడ, సెప్టెంబరు 11: విశాఖ ఫార్మా సిటీలోని అడ్మిరాన్ లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి విధులకు వెళ్లి, తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో కుటుంబ సభ్యులు బుధవారం పరిశ్రమ వద్దకు చేరుకుని ఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా వేపాడ మండలం వీలుర్తి గ్రామానికి చెందిన ఆర్.సూర్యనారాయణ(40) అడ్మిరాన్ లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో ప్రొడక్షన్ మేనేజరుగా పనిచేస్తున్నాడు. భార్య, పిల్లలతో కలిసి గాజువాకలో నివాసముంటూ విధులకు హాజరవుతున్నాడు. మంగళవారం జనరల్ షిఫ్ట్ విధులకు హాజరైన ఇతను సాయంత్రం ఐదు గంటల సమయంలో భార్యకు ఫోన్ చేసి, ఇంటికి బయలుదేరుతున్నట్టు చెప్పాడు. కానీ రాత్రి ఏడు గంటలు దాటినా సూర్యనారాయణ ఇంటికి చేరుకోలేదు. భార్య ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ అని వచ్చింది. దీంతో ఆమె పరిశ్రమలో పనిచేస్తున్న ఇతర ఉద్యోగులకు ఫోన్ చేసి వాకబు చేయగా, కంపెనీ నుంచి వెళ్లిపోయారని చెప్పారు. కానీ రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో సూర్యనారాయణ భార్య, కుటుంబ సభ్యులు బుధవారం ఉదయం ఫార్మా కంపెనీకి వెళ్లి వాకబు చేశారు.



ఫార్మా పరిశ్రమ గేటు వద్ద సూర్యనారాయణ కుటుంబీకులు

సూర్యనారాయణ విధులకు హాజరైనట్టు సీసీ ఫుటేజీలో కనిపించింది. కానీ డ్యూటీ అనంతరం బయటకు వెళ్లినట్టు ఎక్కడా రికార్డు కాలేదు. ఇతని ద్విచక్ర వాహనం పార్కింగ్ స్థలంలోనే ఉంది. దీంతో కంగారుపడిన కుటుంబ సభ్యులు... సూర్యనారాయణ ఏమయ్యాడంటూ కంపెనీ ప్రతినిధులను నిలదీశారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ ... మిగతా 8వ పేజీలో

క్రైం... crime news

గుర్తుతెలియని వాహనం ఢీకొని బాలిక మృతి



బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 11: భీమునిపట్నం-నర్సీపట్నం (బీఎన్) రోడ్డులో బుధవారం సాయంత్రం గుర్తుతెలియని వాహనం ఢీకొనంతో బాలిక మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కోమళ్లపూడికి చెందిన గొన్నా మహాలక్ష్మినాయుడు, సంతోషి దంపతుల కుమార్తె షర్మిలదుర్గ (6) స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి చదువుతోంది. బుధవారం పాఠశాల ముగిసిన తర్వాత స్థానిక రామాలయంలో ఉచితంగా బోధిస్తున్న తరగతులకు హాజరైంది. క్లాస్ అయిపోగానే సాయంత్రం ఆరు గంటలకు బీఎన్ రోడ్డు అవతల ఉన్న తన ఇంటికి బయలుదేరి రోడ్డు దాటుతుండగా వడ్డాది నుంచి రావికమతం వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం సంతోష్‌దుర్గను బలంగా ఢీకొంది. తీవ్రంగా గాయపడిన బాలికను తండ్రి మహాలక్ష్మినాయుడు రావికమతంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే బాలిక మృతి చెందినట్టు చెప్పారు. దీంతో బాలిక తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కాగా మహాలక్ష్మినాయుడు దంపతులకు కుమారుడు, కుమార్తె ఇద్దరు సంతానం.

బొగ్గు లారీ బోల్తా



వెంకన్నపాలెం వద్ద బోల్తా పడిన బొగ్గు లారీ

మాకవరపాలెం, సెప్టెంబరు 11: మండలంలోని వెంకన్నపాలెం వద్ద బొగ్గు లారీ బోల్తా పడింది. ప్రస్తుతం వెంకన్నపాలెం వద్ద రోడ్డు మరమ్మతులు చేపడుతున్నారు. ఈ క్రమంలో మండలంలో ఉన్న అల్యూమినియం కంపెనీకి బుధవారం ఉదయం విశాఖపట్నం నుంచి వస్తున్న బొగ్గు లారీ అక్కడకు వచ్చేసరికి అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో లారీలో ఉన్న బొగ్గు పక్కనే ఉన్న మామిడి తోటలో ఒరిగిపోయింది. లారీ డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ దామోదర్ నాయుడు తెలిపారు.

చోరీ కేసుల్లో ఇద్దరు నిందితుల అరెస్టు

- 17 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ దీపిక



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ దీపిక

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 11: రెండు జిల్లాల్లో చోరీ కేసులకు సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్టు అనకాపల్లి జిల్లా ఎస్పీ ఎం.దీపిక తెలిపారు. బుధవారం ఆమె ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనకాపల్లి, విజయనగరం జిల్లాల్లోని పలుచోట్ల చోరీలకు పాల్పడిన ఇద్దరు నిందితులను పరవాడ, అనకాపల్లి సీసీఎస్ పోలీసులు అరెస్టు చేసినట్టు చెప్పారు. వీరి నుంచి సుమారు రూ.12 లక్షలు పైబడి విలువ చేసే 17 తులాల బంగారం ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. విశాఖ నగరంలోని రెల్లివీధికి చెందిన వడ్డాది పోలరాజు, నగర పరిధిలోని చేపలుప్పాడ గ్రామానికి చెందిన చినమన యల్లాజీలను అరెస్టు చేశామన్నారు. పరవాడ పోలీస్ స్టేషన్ పరిధి సాలాపువానిపాలెంలో గత నెల 27వ తేదీన వంటాకు ఎరుకునాయుడు ఇంట్లో చోరీ జరిగిందన్నారు. ఈ ఘటనలో ఏడు తులాలకు పైగా బంగారు ఆభరణాలు, 20 గ్రాముల వెండి వస్తువులు అపహరణకు గురయ్యాయన్నారు. ఈ మేరకు పరవాడ పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. పరవాడ డీఎస్పీ పర్యవేక్షణలో సీఐ, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ల ఆధ్వర్యంలో రెండు బృందాలను ఏర్పాటు చేసి క్లూస్ టీమ్ సమాచారం ఆధారంగా దర్యాప్తు చేపట్టామన్నారు. పైన పేర్కొన్న పోలరాజు, యల్లాజీలను ఈ కేసులో నిందితులుగా గుర్తించి అరెస్టు చేసినట్టు చెప్పారు. అలాగే, అనకాపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎన్జీవోఎస్ కాలనీ, విజయనగరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గాంధీనగర్, వీటీ అగ్రహారంలలో కూడా నిందితులు చోరీలకు పాల్పడ్డారని వివరించారు. ఈ నేరాలకు సంబంధించి కొంత సొత్తును స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులు చెప్పిన ఆధారంగా ఈ కేసుల్లో దొంగిలించబడిన మరికొంత సొత్తును కొనుగోలు చేసిన నల్లా వెంకటేష్ నుంచి కూడా కొన్ని బంగారం వస్తువులను రికవరీ చేయడమైందని ఆమె తెలిపారు. నిందితులను లంకెలపాలెం జంక్షన్ వద్ద బుధవారం అరెస్టు చేసి వారి నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసును ఛేదించిన పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు, సీసీఎస్ సీఐ కె.అప్పలనాయుడు, సీసీఎస్ ఎస్ఐ పి.రమేష్, పరవాడ సీసీఎస్ పోలీస్ స్టేషన్ల సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

2 కిలోల గంజాయితో ఒకరి అరెస్టు

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 11: రామచంద్రపురం జంక్షన్‌లో రెండు కిలోల లిక్విడ్ గంజాయితో ఒకరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు కృష్ణాదేవిపేట ఎస్ఐ ఎం.ఉపేంద్ర తెలిపారు. గొలుగొండ మండలం ఏటిగైరంపేటకు చెందిన మేడిశెట్టి గోవింద ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతాలకు లిక్విడ్ గంజాయి తరలిస్తుండగా, లింగంపేట పంచాయతీ రామచంద్రపురం జంక్షన్‌లో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు పట్టుకున్నారు. పోలీసులను చూసిన గోవింద ఆటో దిగి బ్యాగ్‌తో సహా పరుగు తీశాడు. దీంతో అనుమానం వచ్చి అతడిని పట్టుకుని బ్యాగ్‌ను తనిఖీ చేయగా అందులో లిక్విడ్ గంజాయి ఉంది. దీంతో అతడిపై కేసు నమోదు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ ఎం.ఉపేంద్ర తెలిపారు.

కిరండోల్ రైళ్లు దంతెవాడ వరకే..

విశాఖపట్నం, సెప్టెంబరు 11: కేకే లైనులోని బచేలి, కిరండోల్ మధ్య భారీ వర్షాల కారణంగా విశాఖ-కిరండోల్ మధ్య నడుస్తున్న రైళ్ల గమ్యాలను కుదించి విశాఖ-దంతెవాడ మధ్య రాకపోకలు సాగించేలా పరిమితం చేశామని సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. దీంతో విశాఖ-కిరండోల్ రాత్రి ఎక్స్‌ప్రెస్ (18514), విశాఖ-కిరండోల్ ప్రత్యేక రైలు (08551) సర్వీసులు ఈ నెల 12 నుంచి 18 వరకు విశాఖ నుంచి దంతెవాడ మధ్య, తిరుగు ప్రయాణంలోని కిరండోల్-విశాఖ రాత్రి ఎక్స్‌ప్రెస్ (18513), కిరండోల్-విశాఖ ప్రత్యేక రైలు (08552) సర్వీసులు ఈ నెల 13 నుంచి 19వ తేదీ వరకు దంతెవాడలో బయలుదేరి విశాఖకు చేరుతాయని పేర్కొన్నారు. దంతెవాడ, కిరండోల్ మధ్య రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశామన్నారు.

తిరుపతి-శ్రీకాకుళంరోడ్డు ప్రత్యేక రైళ్లు రద్దు

విశాఖపట్నం, సెప్టెంబరు 11: నిర్వహణ కారణాల దృష్ట్యా తిరుపతి, శ్రీకాకుళం రోడ్డు స్టేషన్ల మధ్య నడిచే ప్రత్యేక రైళ్లను రద్దు చేస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. తిరుపతి-శ్రీకాకుళం రోడ్డు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ (07440) రైలు అక్టోబరు 6 నుంచి డిసెంబరు 1 వరకు, తిరుగు ప్రయాణంలోని శ్రీకాకుళం రోడ్డు-తిరుపతి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ (07441) రైలు అక్టోబరు 7 నుంచి డిసెంబరు 2 వరకు రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539

గజానికో గండం..!

భారీ వర్షాలకు అస్తవ్యస్తంగా మారిన పలు గ్రామాల రహదారులు

- రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు
- గత ఐదేళ్లలో పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని అంతా వేడుకోలు



సంతపాలెం నుంచి వెల్చూరు వెళ్లే దారిలో...



నేవీ రోడ్డులో సంతపాలెం జంక్షన్ సమీపంలో దుస్థితి

రాంబిల్లి, సెప్టెంబరు 11: వాయుగుండం కారణంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు అత్యంత దారుణంగా మారాయి. ఎక్కడికక్కడ తేలి, గోతులు ఏర్పడాయి. వాటిలో వర్షపు నీరు చేరడంతో రాకపోకలకు వాహనచోదకులు ప్రత్యక్ష నరకాన్ని చూస్తున్నారు. కొన్నిచోట్ల గోతులు చెరువులను తలపిస్తున్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. వాడ నర్సాపురం నుంచి వెంకటాపురం వెళ్లే నేవీ రోడ్డు, సంతపాలెం నుంచి వెల్చూరు మీదుగా పెదకలవలాపల్లి వెళ్లే రోడ్డు, రాజుకోడూరు, అప్పారాయుడుపాలెం, కృష్ణంపాలెం గ్రామాలకు వెళ్లే రోడ్ల దుస్థితి చెప్పనక్కర్లేదు. చాలాచోట్ల గొయ్యి ఎక్కడో, రోడ్డు ఎక్కడో గుర్తించడం కష్టంగా ఉంది. వీటిపై ప్రయాణం అంటే సాహసమనే చెప్పాలి. పగటి పూట ఎలాగోలా రాకపోకలు సాగిస్తున్నామని, రాత్రి వేళ ఈ రోడ్లపై ప్రయాణం అంటే భయంగా ఉందని పలువురు వాపోతున్నారు. వర్షాలు పడినప్పుడల్లా గోతులు మరింత పెరిగిపోతున్నా కన్నెత్తి చూసే వారు కరువయ్యారని పేర్కొంటున్నారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే నేడు ఈ దుస్థితి ఏర్పడిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ఈ రోడ్ల మరమ్మతుకు ప్రత్యేక దృష్టి సారించాల్సిందిగా వాహన చోదకులతో పాటు ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



రాజుకోడూరు వెళ్లే రోడ్డులో...

వడ్డాది హైస్కూల్‌లో జడ్పీ చైర్‌పర్సన్ ఆకస్మిక తనిఖీ

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 11: వడ్డాది కేపీడీ జడ్పీ హైస్కూల్‌ను జడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతుల నిర్వహణను గురించి ఇన్‌చార్జ్ హెచ్ఎం వెంకట్రావును అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడారు. కొన్ని ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. మధ్యాహ్న భోజనం నాణ్యత గురించి అడగ్గా.. అంతగా బాగుండడం లేదంటూ విద్యార్థులు ఫిర్యాదు చేశారు. దీంతో మధ్యాహ్న భోజనం అమలులో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. త్వరలో మళ్లీ స్కూలును సందర్శిస్తానని, అప్పుడు కూడా ఇలాంటి ఫిర్యాదులు అందితే సహించేది లేదంటూ భోజన నిర్వాహకులకు స్పష్టం చేశారు. అనంతరం స్థానిక శ్మశాన వాటికలో జడ్పీటీసీ నిధులతో చేపట్టనున్న చేతి బోరు నిర్మాణ పనులకు సుభద్ర శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, సర్పంచ్‌లు గోపిశెట్టి శ్రీనివాసరావు, వినపోలు రామునాయుడు, పెదిరెడ్ల మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.



వడ్డాది హైస్కూల్‌ను తనిఖీ చేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

కల్యాణపులోవ రిజర్వాయర్ వద్ద రెండు గేట్ల ఎత్తివేత



కల్యాణపులోవ రెండు గేట్లు ఎత్తి సర్పానదిలోకి అదనపు నీటిని విడిచి పెడుతున్న దృశ్యం

- వరద ప్రవాహం పెరగడంతో వంద క్యూసెక్కుల నీరు విడుదల

రావికమతం, సెప్టెంబరు 11: మండలంలోని కల్యాణపులోవ రిజర్వాయర్‌కు వరద ప్రవాహం కొనసాగుతుండంతో బుధవారం రెండు గేట్లు ఎత్తి వంద క్యూసెక్కుల మేర అదనపు నీటిని విడిచిపెట్టినట్టు జేఈ సత్యనారాయణదొర తెలిపారు. 460 అడుగుల సామర్థ్యం గల ఈ రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో అధికంగా రావడంతో ఆది, సోమవారాలు నాలుగు గేట్లు ఎత్తి కొంత నీటిని విడుదల చేశారు. మంగళవారం నాటికి ఇన్‌ఫ్లో తగ్గడంతో ఎత్తిన నాలుగు గేట్లు మూసి వేశారు. అయితే ఇన్‌ఫ్లో 150 క్యూసెక్కుల మేర రిజర్వాయర్‌లోకి వస్తుండడంతో బుధవారం నాటికి 459.02 అడుగులకు నీటి నిల్వలు చేరింది. ఇది రిజర్వాయర్ గరిష్ట స్థాయికి చేరువ కావడంతో రెండు గేట్లు ఎత్తి వంద క్యూసెక్కుల మేర నీటిని సర్పా నదిలోకి విడిచి పెడుతున్నట్టు జేఈ వెల్లడించారు.

ఎస్సీ వర్గీకరణకు అనుకూల తీర్పును పునఃసమీక్షించాలి

- దళిత నాయకుల డిమాండ్



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న దళిత నాయకులు

పాయకరావుపేట, సెప్టెంబరు 11 : ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం వర్గీకరణను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో దళిత నాయకులు చేపట్టిన ధర్నాకు సంఘీభావంగా పాయకరావుపేటలో సదరు నాయకులు ర్యాలీ, ఆందోళన చేపట్టారు.

ఈ సందర్భంగా మెయిన్ రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత నాయకులు పెదపాటి మేఘరంజన్ తదితరులు మాట్లాడుతూ పార్లమెంట్ ఆమోదం, ఆర్టికల్ 341 సవరణ, రాష్ట్రాల అభిప్రాయ సేకరణ చేయకుండా సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణ చేసుకోవచ్చని ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి రివ్యూ పిటిషన్ వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు ఇంజరపు సూరిబాబు, పల్లి దుర్గారావు, కువల కుమార్, తాటిపాక లోవరాజు, పల్లా ప్రసాద్, ఐఎస్ మూర్తి, ఏనుగుపల్లి అప్పారావు, గారా చంటి, రమేష్ పాల్గొన్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేసిన కేంద్ర బృందం

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 11 : పట్టణంలోని గవరపాలెం అరుంధతినగర్‌లో గల అర్బన్ హెల్త్ సెంటర్‌ను కేంద్ర బృందం బుధవారం తనిఖీ చేసింది. నేషనల్ క్వాలిటీ, ఎక్యూర్డ్ స్టాండర్డ్ కమిటీ సభ్యులైన డాక్టర్ బాలకృష్ణ, డాక్టర్ రమణ స్వాతివామన్‌లు వార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న వైద్యసేవలను వైద్యాధికారి డాక్టర్ వీవీఎస్ జయదీప్ ద్వారా తెలుసుకున్నారు. ఆశ వర్కర్లు వార్డులో అందించిన సేవలపై ఆరా తీశారు.

'వర్షాల వల్ల జీవీఎంసీకి రూ.21 లక్షలు నష్టం'

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 11 : వాయుగుండం కారణంగా కొద్దిరోజులుగా కురిసిన వర్షాలకు జీవీఎంసీకి రూ.21 లక్షలు నష్టం వాటిల్లిందని అనకాపల్లి జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 0.3 కిలోమీటర్లు రహదారులు, 0.2 కిలోమీటర్లు కాలువలు దెబ్బతిన్నాయన్నారు. ఇందుకు సంబంధించిన నివేదికను జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి పంపినట్టు చెప్పారు.

పంచ గ్రామాల భూ సమస్యకు పరిష్కారం?

- దేవస్థానానికి సుమారు 426 ఎకరాలు ఇచ్చేందుకు రంగం సిద్ధం
- ములగాడ, ఆనందపురం మండలాల్లో భూములు పరిశీలన
- ఎన్నికల హామీ నెరవేర్చే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు



స్థల పరిశీలన చేస్తున్న ఈవో, అధికారులు

సింహాచలం, సెప్టెంబరు 11: వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంతో ముడివడిన పంచ గ్రామాల భూ సమస్య పరిష్కారం దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. పంచ గ్రామాల్లో అన్యాక్రాంతమైన భూములకు ప్రత్యామ్నాయంగా సింహాచలం దేవస్థానానికి సుమారు 426 ఎకరాల బదలాయింపునకు చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీ బుధవారం ఆనందపురం మండలంతో పాటు గాజువాక సమీపాన గల ములగాడలోని సర్వే నంబరు 35లో భూములను పరిశీలించింది. త్రిసభ్య కమిటీలో దేవస్థానం ఈఓ, రెవెన్యూకు చెందిన ఆర్జేసీ కూడా ఉన్నారు. దేవస్థానం భూముల్లో గల 12,149 ఆక్రమణలను క్రమబద్ధీకరించేందుకు, అందుకు ప్రత్యామ్నాయంగా సుమారు 426 ఎకరాలు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో తొలుత దేవదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ ఈనెల ఒకటో తేదీన సింహాచలం దేవస్థానం ఈఓతో కలిసి ప్రత్యామ్నాయంగా రెవెన్యూ అధికారులు ప్రతిపాదించిన ములగాడ భూములను పరిశీలించినట్టు తెలుస్తోంది. బుధవారం మరోమారు భూములు పరిశీలించిన బృందం త్వరలో జిల్లా కలెక్టర్‌కు నివేదిక సమర్పించనున్నది. ఇదిలావుండగా పంచగ్రామాల భూ సమస్య పరిష్కరిస్తామని ఎన్నికల సమయంలో కూటమి నేతలు/అభ్యర్థులు హామీ ఇచ్చారు. ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల ప్రకారం అధికారులు ముందుకువెళుతున్నారు.

చందన అలంకరణలో స్వయంభూ విఘ్నేశ్వరుడు



చందన అలంకరణలో స్వయంభూ విఘ్నేశ్వరుడు

వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజైన మంగళవారంనాడు చోడవరంలోని స్వయంభూ విఘ్నేశ్వరుడు చందనం అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు కొడమంచిలి చలపతి చందన అలంకరణలో స్వామిని ముస్తాబు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి స్వయంభూ విఘ్నేశ్వరుడిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

-చోడవరం

పెంటకోట మెరైన్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ



పెంటకోట తీరాన్ని పరిశీలిస్తున్న మెరైన్ ఎస్పీ వర్మ

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 11: మండలంలోని పెంటకోట మెరైన్ పోలీసు స్టేషన్‌ను మెరైన్ విభాగం ఎస్పీ పీవీఆర్ఎస్ఎస్ఎస్ఆర్ వర్మ బుధవారం సందర్శించారు. తొలుత రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం తీర ప్రాంతంలో పర్యటించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. తీర ప్రాంత పరిరక్షణకు అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. వినాయక విగ్రహాల నిమజ్జనం సమయంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తీర ప్రాంతంలో బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ నారీమణి, ఎస్ఐ డి.రత్నశేఖర్, ఏఎస్ఐ కృష్ణ పాల్గొన్నారు.

అటవీ అమరవీరులకు నివాళి



అటవీ అమరవీరుల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

కొత్తూరు, సెప్టెంబరు 11 : జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవాన్ని బుధవారం అనకాపల్లి పరిధి కొత్తూరులో నిర్వహించారు. జిల్లా అటవీ శాఖాధికారి జి.లక్ష్మణ్ హాజరై అటవీ అమరవీరుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఇందులో నిర్లక్ష్యం చూపితే జీవకోటికి ఇబ్బందులు తప్పవన్నారు. అటవీ సందప రక్షణకు అంతా కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రేంజ్ ఆఫీసర్లు చంద్రశేఖర్, లావణ్య, గౌరీష్, సుబ్బారావులతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

జ్వరాలు ఉన్న గ్రామాల్లో వైద్య శిబిరాలు

- జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి చంద్రశేఖర్‌దేవ్



వాలాబులో వైద్య శిబిరం పరిశీలిస్తున్న డీఐవో చంద్రశేఖర్ దేవ్

దేవరాపల్లి, సెప్టెంబరు 11: జ్వరాలు అధికంగా ఉన్న గ్రామాల్లో సత్వరమే వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి కె.చంద్రశేఖర్ దేవ్, జిల్లా మలేరియా అధికారి కె.వరహాలు దొర తెలిపారు. వాలాబులో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని వీరు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ జ్వరాల వ్యాప్తికి కారణాలు పరిశీలించి నియంత్రణ చర్యలు చేపట్టడం, వైద్య శిబిరాల ఏర్పాటు, మందుల పంపిణీ తదితర చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. అనంతరం దేవరాపల్లి పీహెచ్‌సీలో వ్యాధి నిరోధక టీకాలు భద్రపరిచే గది, రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి పూజితామేఘన, పర్యవేక్షకులు పుష్పరాజు, ఫార్మసిస్ట్ సత్యమూర్తి, రవితేజ, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

13న జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం

విశాఖపట్నం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం ఈనెల 13న నిర్వహించనున్నట్టు కార్యదర్శి ఎంవీడీ ఫణిరాం తెలిపారు. ఈనెల నాలుగున స్టాండింగ్ కమిటీ సమావేశం జరగాల్సి ఉన్నప్పటికీ విజయవాడలో వరదలు కారణంగా కమిషనర్ పి.సంపత్‌కుమార్‌తోపాటు పలువురు అధికారులు అక్కడ సహాయకచర్యల్లో పాల్గొనేందుకు వెళ్లిపోవడంతో సమావేశం వాయిదా పడింది. సమావేశం కోసం ఇప్పటికే 280 అంశాలతో అజెండా తయారుచేసి సభ్యులకు పంపిణీ చేశారు. అదే అజెండాతో శుక్రవారం స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్టు ఫణిరాం తెలిపారు.

30న పెన్షన్ అదాలత్

విశాఖపట్నం, సెప్టెంబరు 11: ఎంవీపీ కాలనీలోని ఆర్ఎంఎస్ కార్యాలయం ఆవరణలో ఈనెల 30న ఉదయం 11 గంటలకు పెన్షన్ (డాక్) అదాలత్ నిర్వహించనున్నట్టు డివిజన్ సూపరింటెండెంట్ తెలిపారు. ఈమేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంవీపీ కాలనీలోని బస్ డిపో సమీపంలో ఉన్న పోస్టల్ అడ్మినిస్ట్రేటివ్ కాంప్లెక్స్ కింద అంతస్థులో తపాలా సేవలు, పెన్షన్‌లకు సంబంధించి ప్రజా ఫిర్యాదులు స్వీకరిస్తారని చెప్పారు. ఆర్ఎంఎస్ - వి.విభాగానికి చెందిన మెయిల్స్ స్పీడ్ పోస్ట్ కథనాలు, పార్సిల్స్, మనీ ఆర్డర్‌లకు సంబంధించిన అన్ని సమస్యలపై ఫిర్యాదులు ఇవ్వవచ్చని పేర్కొన్నారు. వి.డివిజన్ పరిధిలో తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఆర్ఎంఎస్/పెన్షన్ అదాలత్ అన్న శీర్షికతో ఈనెల 23వ తేదీలోగా ఫిర్యాదులను సూపరింటెండెంట్, ఆర్ఎంఎస్ - వి.డివిజన్, విశాఖపట్నం 530017 అన్న చిరునామాకు పంపించాలని ఆయన సూచించారు.

వైఎస్ విగ్రహం ఉన్న దిమ్మపై వివాదం

- బస్టాండ్‌లోకి ఎక్స్‌ప్రెస్‌లు వచ్చేందుకు అడ్డంకిగా ఉందన్న అధికారులు
- నాలుగు అడుగులు మాత్రమే తొలగిస్తామన్న మునిసిపాలిటీ
- ముందస్తు సమాచారం లేదని వైసీపీ శ్రేణులు అభ్యంతరం
- ఇరు వర్గాల వాగ్వాదంతో ఉద్రిక్త పరిస్థితులు
- ఎమ్మెల్యే జోక్యంతో పరిష్కారం


అధికారులతో మాట్లాడుతున్న ఎంపీపీ బోదెపు గోవింద్, వైస్ చైర్మన్లు

ఎలమంచిలి, సెప్టెంబరు 11 : పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ జంక్షన్ వద్ద ఉన్న వైఎస్ విగ్రహం దిమ్మ కాస్త తొలగింపు అంశంపై మునిసిపల్ అధికారులకు, వైసీపీ నాయకుల మధ్య బుధవారం వాగ్వాదం చోటుచేసుకుంది. సదరు దిమ్మను తొలగించేందుకు మునిసిపల్ అధికారులు ప్రయత్నించడంతో వైసీపీ నాయకులు అభ్యంతరం తెలిపారు. ముందుస్తు సమాచారం లేకుండా తొలగించడం ఏమిటని ప్రశ్నించారు. దీంతో విగ్రహం వద్దకు ఇటు వైసీపీ శ్రేణులు, అటు పట్టణ పోలీసులు పెద్ద సంఖ్యలో చేరుకోవడంతో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బస్టాండ్‌లోకి ఎక్స్‌ప్రెస్ బస్సులు వచ్చేందుకు విగ్రహం వద్ద ఉన్న దిమ్మ ఆటంకంగా ఉంటుందని, ఆర్టీసీ అధికారుల సూచన మేరకు విగ్రహం వద్ద ఉన్న దిమ్మను నిబంధనల మేరకు తొలగించాలని జనసేన నేతలు ఇటీవల మునిసిపల్ కమిషనర్‌కు వినతిని అందజేశారు. ఈ విషయం మాజీ ఎమ్మెల్యే కన్నబాబు దృష్టికి తీసుకు వెళ్లామని, బస్సులు వచ్చేందుకు ఆటంకం లేకుండా చూడాలని కన్నబాబు సూచించారని వైసీపీ నేతలు తెలిపారు. అయితే దిమ్మను తొలగించే ముందు ఎటువంటి సమాచారం ఇవ్వలేని మునిసిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ ప్రభాకరరావు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ శ్రీలక్ష్మి, ఏఈ సుబ్బారావులను వారు ప్రశ్నించారు. దీంతో రెండు గంటలు పాటు కొంత ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, చైర్‌పర్సన్ రమాకుమారి దృష్టికి ఫోన్ ద్వారా తీసుకు వెళ్లారు. ఇదే సమయంలో దిమ్మను తొలగించిన వెంటనే విగ్రహం వద్ద అసౌకర్యంగా ఉండకుండా పనులు చేపట్టాలని వైసీపీ నాయకులు కోరారు. దీంతో మునిసిపల్ అధికారులు దిమ్మను నాలుగు అడుగులు తొలగించి అసౌకర్యంగా లేకుండా పనులు చేపట్టారు. దీంతో పరిస్థితి చక్కబడింది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోదెపు గోవింద్, మునిసిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, అర్రెపు గుప్తా, వైసీపీ నాయకులు సంతోష్, త్రినాథ్, దూది నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై పునః సమీక్షకు ఆందోళన



అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలిస్తున్న ఆందోళనకారులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 11 : సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పును పునః సమీక్షించాలని కోరుతూ అనకాపల్లి జిల్లా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక సంఘాల జేఏసీ, అంబేడ్కర్ ఇండియన్ మిషన్ ఆధ్వర్యంలో పట్టణంలో బుధవారం ఆందోళన చేపట్టారు. రామచంద్ర థియేటర్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహం నుంచి నెహ్రూచౌక్ వరకు నిరసన ప్రదర్శనగా వెళ్లి మానవహారంగా ఏర్పడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునః సమీక్షించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు మర్రా చంద్రశేఖర్, పి.బాబ్జి, పావాడ సన్యాసిరావు, చెక్కా రాంబాబు, నూక రాజు, తాతబాబు, అంబేడ్కర్ ఇండియన్ మిషన్ సభ్యులు బోగేసు, అప్పారావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరంలో విద్యుత్‌కు అంతరాయం రేపు

పరవాడ (సబ్బవరం), సెప్టెంబరు 11 : సబ్బవరం-1 సెక్షన్ పరిధిలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సబ్బవరం సబ్‌స్టేషన్ పరిధిలో పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. తవ్వవానిపాలెం, అమృతపురం, గొల్లలపాలెం, పైడివాడ, ఆసకపల్లి, ఇరువాడ, పల్లవానిపాలెం, జాగారపువానిపాలెం గ్రామాల వినియోగదారులకు ఈ అసౌకర్యం కలగనుందని పేర్కొన్నారు. అంతా సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

గోవాడ షుగర్స్ మహాజన సభ 28న

... 5వ పేజీ తరువాయి

ప్రయత్నిస్తున్నామన్నారు. బుధవారం ఆరు వేల టన్నుల మొలాసిస్‌ను విక్రయించినట్టు తెలిపారు. వచ్చే సీజన్‌లో చెరకు రైతులకు త్వరితగతిన బకాయిలు చెల్లించేందుకు కృషి చేస్తామని ఆయన చెప్పారు. ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తే షుగర్ ఫ్యాక్టరీకి ఆదాయం పెరిగి, ఆర్థికంగా లాభదాయకంగా ఉంటుందని ఆయన తెలిపారు. దీనిపై ఇప్పటికే డీపీఆర్ తయారైందని, త్వరలో ప్రజాప్రతినిధుల సహకారంతో ప్లాంట్ ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తామని ఆయన వెల్లడించారు.

బాక్సింగ్ రింగ్‌కు బ్రేకు

... 5వ పేజీ తరువాయి

టీడీపీ ప్రభుత్వ హయాంలో స్కేటింగ్ రింక్ ఏర్పాటు చేయడానికి అప్పుడు మంత్రిగా వున్న సీహెచ్ అయ్యన్నపాత్రుడు కృషి చేశారు. ఇక్కడ జిల్లా, రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలు నిర్వహించడానికి వీలుగా ఉంటుందని భావించారు. కాగా స్కేటింగ్ రింక్ ఆవరణలో ఉన్న స్థలంలో బాక్సింగ్ రింగ్, ఇండోర్ హాల్ నిర్మాణం చేయడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. దీంతో ఆర్‌అండ్‌బీ అధికారులు పనులు ఆపేశారు.

ఇతర ప్రాజెక్టులకు నిధులు మళ్లింపు

జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆధ్వర్యంలో మంగళవారం అనకాపల్లిలో స్పోర్ట్స్ అథారిటీ ప్రాజెక్టుల మీద సమీక్షా సమావేశం నిర్వహించారు. కొత్తగా స్పోర్ట్స్ ప్రాజెక్టుల ఆవశ్యకత, నిర్మాణంలో ఉన్న పనులపై సమీక్ష జరిగింది. నర్సీపట్నంలో నిలిచిపోయిన బాక్సింగ్ రింగ్, ఇండోర్ హాల్ నిధులను వేరే ప్రాజెక్టుకు ఉపయోగించాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. కాగా నర్సీపట్నంలో శిక్షణ తీసుకుంటున్న బాక్సింగ్ క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధిస్తున్నారు. బాక్సింగ్ రింగ్ ఉంటే శిక్షణకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. కానీ మైదానంలో ప్రాక్టీస్ చేసి, రింగ్‌లో పోటీ పడాలంటే ఇబ్బంది పడుతున్నారు. అందువల్ల బాక్సింగ్ రింగ్, ఇండోర్ హాల్‌ను మరోచోట అయినా నిర్మించాలని క్రీడాకారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఫార్మా ఉద్యోగి అదృశ్యం

... 5వ పేజీ తరువాయి

భార్య బాల మాట్లాడుతూ, డ్యూటీ ముగిసిన తరువాత తన భర్త ఇంటికి రాలేదని, పరిశ్రమలో అడిగితే ఇంటికి వెళ్లిపోయాడని చెబుతున్నారని, లోపల ఏదో ప్రమాదం జరిగి ఉండొచ్చనని, ఆ విషయాన్ని యాజమాన్యం దాచిపెడుతున్నదని ఆరోపించారు. తన భర్తకు ఏదైనా హానీ జరిగితే యాజమాన్యమే బాధ్యత వహించాలని ఆమె స్పష్టం చేశారు.

పోలీసులకు ఫిర్యాదు, విచారణ

సూర్యనారాయణ అదృశ్యంపై కుటుంబ సభ్యులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఆర్.మల్లికార్జునరావు ఫార్మా పరిశ్రమకు చేరుకుని యాజమాన్యంతో మాట్లాడారు. ఉద్యోగులను విడివిడిగా విచారించారు. సూర్యనారాయణ ఎలా ఉండేవారు, ఎవరితోనైనా గొడవలు ఉన్నాయా వంటి విషయాల గురించి ప్రశ్నించారు. కాగా సూర్యనారాయణ పరిశ్రమ నుంచి బయటకు వెళ్లినట్టు సీసీ ఫుటేజీలో రికార్డు కాకపోవడంతో అతను ప్రహరీ గోడ దూకి వెళ్లిపోయి వుంటాడని యాజమాన్య ప్రతినిధులు చెబుతున్నారు. కానీ సుమారు ఆరు అడుగుల ఎత్తు వున్న ప్రహరీ గోడను దూకే అవకాశం లేదని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. పోలీసులు అదృశ్యం కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాకాసిలా.. రక్షిత భవనం

వాడనర్సాపురంలో శిథిలమైన తుఫాన్ షెల్టర్

- ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి
- భవనాన్ని ఆనుకునే పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంతో పాటు పలువురు నివాసం


శిథిలమై కూలేందుకు సిద్ధంగా ఉన్న తుఫాన్ రక్షిత భవనం

రాంబిల్లి, సెప్టెంబరు 11 : మండలంలోని మత్స్యకార గ్రామం వాడ నర్సాపురంలో తుఫాన్ రక్షిత భవనం శిథిలమై కూలేందుకు సిద్ధంగా ఉంది. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు గ్రామస్థులకు ఆసరాగా ఉండేలా ఏళ్ల క్రితం దీని నిర్మాణం చేపట్టారు. నిర్వహణను పట్టించుకునే వారు లేకపోవడంతో ప్రస్తుతం పూర్తిగా శిథిలమైంది. ఇప్పటికే భవనం గోడలు బీటలు వారాయి. పలుచోట్ల పెచ్చులూడి పడుతున్నాయి. ఇదివరకే మెట్ల భాగంగా మొత్తం కూలిపోయింది. ఈ భవనాన్ని ఆనుకొని ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ భవనంతో పాటు, పలువురి ఇళ్లు కూడా ఉన్నాయి. ఈ భవనం దుస్థితిని చూసిన వారంతా ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకు వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. పిల్లలను చదువులకు పంపించాలంటే తల్లిదండ్రులు భయపడుతున్నారు. ఈ భవనం దుస్థితిని గ్రామ సందర్శనకు వచ్చిన గత వైసీపీ నాయకులు, అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకు వెళ్లామని, అయినప్పటికీ స్పందించలేదని వారంతా వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రస్తుత పాలకులు స్పందించి శిథిల భవనాన్ని తొలగించాలని వారంతా కోరుతున్నారు. లేనిపక్షంలో పెను ప్రమాదం తప్పదని పేర్కొంటున్నారు.


వాడ నర్సాపురంలో శిథిలావస్థకు చేరిన తుఫాన్ భవనాన్ని ఆనుకుని ఉన్న పాఠశాల

గ్రోమోర్ దుకాణం సిబ్బంది మెలికతో స్వల్ప వివాదం

- యూరియా బస్తా కావాలంటే పొటాష్ కూడా కొనాలని నిబంధన
- అభ్యంతరం తెలిపిన రైతులు, టీడీపీ నాయకుడు
- ఏవో సౌజన్యకు ఫిర్యాదు
- ఆమె రాకతో సమస్యకు పరిష్కారం
- షోకాజ్ నోటీసు జారీ


దుకాణం వద్దకు యూరియా కోసం వచ్చిన రైతులు, సిబ్బందిని ప్రశ్నిస్తున్న కోన అప్పలరాజు

ఎస్.రాయవరం, సెప్టెంబరు 11 : మండలంలోని అడ్డరోడ్డులో ఉన్న గ్రోమోర్ దుకాణం వద్ద బుధవారం స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని ఆరోపిస్తూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు దుకాణం వద్దకు యూరియా కోసం కోనవానిపాలేనికి చెందిన రైతు, టీడీపీ బీసీ సెల్ జిల్లా కన్వీనర్ కోన అప్పలరాజు బుధవారం వెళ్లారు. ఐదు యూరియా బస్తాలు కావాలని అడిగారు. దీంతో సిబ్బంది యూరియాతో పాటు పొటాష్ కూడా తీసుకుంటే ఇస్తామని బదులిచ్చారు. దీనిపై ఆగ్రహించిన అప్పలరాజు మండల వ్యవసాయాధికారి సౌజన్యకు ఫిర్యాదు చేశారు. వెంటనే ఆమె దుకాణం వద్దకు వచ్చి సిబ్బందిని ప్రశ్నించడంతో వారు ఒప్పుకున్నారు. అప్పటికే యూరియా కోసం అక్కడున్న పలువురు రైతులు మాట్లాడుతూ తమకు కూడా ఇదే సమస్య ఎదురైందని ఆరోపించారు. దీంతో దుకాణంలో స్టాక్ వివరాలను ఏవో పరిశీలించారు. పొటాష్ స్టాక్ లేనట్టు గుర్తించారు. అసలు పొటాష్ స్టాకే లేనప్పుడు రైతులను పొటాష్ కొనాలని ఎలా అంటారని సిబ్బందిని ఆమె ప్రశ్నించారు. అంతేకాకుండా ఆధార్‌కు ఒకయూరియా బస్తా ఇస్తున్నారని తెలుసుకున్న సౌజన్య ఆధార్ కార్డు ఆధారంగా యూరియా తీసుకు వెళ్లే వారంతా రైతులని ఎలా నిర్ధారిస్తారని ప్రశ్నించారు. ఇకపై ఇటువంటి తప్పిదాలను సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం గ్రోమోర్ సిబ్బందికి షోకాజ్ నోటీస్ జారీ చేశారు. వారి సమాధానం ఆధారంగా చర్యలు తీసుకుంటామని వివరించారు. మండలంలో మొత్తం ఆరు ఎరువుల దుకాణాల్లో ఎరువుల విక్రయం జరుగుతోందని ఏవో తెలిపారు.

గ్రామాల్లో ఎమ్మెల్యే 'సుందరపు' పర్యటన


పెదకవలాపల్లిలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్, తహసీల్దార్

రాంబిల్లి, సెప్టెంబరు 11 : మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పర్యటించారు. తొలుత వై.లోవ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. సర్పంచ్, మాజీ సర్పంచ్‌లు బద్ది నారాయణరావు, బి.నారాయణరావులు ప్రధాన సమస్యలను ఆయకు వివరించారు. తమ గ్రామాన్ని ఆనుకొని ఉన్న కొండచుట్టూ నేవీ అధికారులు డీఆర్‌డీవో ద్వారా ప్రహరీ గోడ నిర్మాణం చేపడుతున్నారన్నారు. ఈ కొండే గ్రామస్థులకు జీవనాధారమని పేర్కొన్నారు. శారదా నదిగెడ్డ ఉధృతంగా ప్రవహించే సమయాల్లో పెదకలవలాపల్లి నుంచి తమ గ్రామానికి వచ్చే రోడ్డు మునిగే సందర్భంలో ఈ కొండపై నుంచి పక్క గ్రామానికి వెళ్లి నిత్యావసర వస్తువులు తెచ్చుకుంటుంటామని వివరించారు. ఈ కొండ చుట్టూ గోడ నిర్మిస్తే తాము అన్నివిధాలా నష్టపోతామని తెలిపారు. అనంతరం ఆయన పెదకవలాపల్లి గ్రామంలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. తహసీల్దార్ పి.భాగ్యవతి, ఎలమంచిలి సీఐ నర్సింగరావు, పలు శాఖల అధికారులతో పాటు టీడీపీ, జనసేన మండల శాఖ అధ్యక్షులు వి.దిన్‌బాబు, పప్పల నూకన్నదొర, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ధూళి రంగనాయకులు, పెదకలవలాపల్లి మాజీ సర్పంచ్ కర్రి సింహగిరి ప్రసాద్, మాజీ ఎంపీటీసీ రావి దేముళ్ళు, రెండు గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.


నీట మునిగిన పంట పొలాలు పరిశీలన

- నష్టపోయిన రైతులకు న్యాయం జరిగేలా కృషి : కొణతాల


రైతుల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 11 : వర్షాల కారణంగా నీటి ముంపునకు గురైన పంట పొలాలను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ బుధవారం పరిశీలించారు. ఆవఖండం, కొప్పాక, శంకరం తదితర గ్రామాల్లో ఆయన పర్యటించి పంటల పరిస్థితిని తెలుసుకున్నారు. తోటాడ రెగ్యులేటర్ ప్రాంతానికి కూడా వెళ్లారు. పంటలు నష్టపోయిన రైతులకు న్యాయం జరిగేలా తనవంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

'ప్రభుత్వం దృష్టికి రైతుల కష్టాలు'


బవులవాడలో పొలాన్ని పరిశీలిస్తున్న నేతలు

తుమ్మపాల, సెప్టెంబరు 11 : భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతుల కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ తెలిపారు. బవులవాడ రెవెన్యూ పరిధిలో నీట మునిగిన వరి పొలాలను బుధవారం స్థానిక నాయకులు, వ్యవసాయాధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. పంట నష్టం గురించి తెలుసుకున్నారు. వ్యవసాయాధికారులు శ్రీనివాస్, ఎంపీటీసీ విజయ్, నాయకులు బత్తుల రమేష్, ఎం.చలపతిరావు, సీత తదితరులు పాల్గొన్నారు.

'మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలి'


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కుసుమ, అధికారులు

తుమ్మపాల, సెప్టెంబరు 11 : మహిళా చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని అనకాపల్లి బార్ కౌన్సిల్ సభ్యురాలు కేతా కుసుమ అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం ఇక్కడి ఎంపీడీవో కార్యాలయంలో చట్టాలపై ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. మహిళల భద్రత విషయంలో మిషన్‌శక్తి కమిటీలు ఏర్పాటు చేయడం ఆనందదాయకమన్నారు. బాధిత మహిళలు కమిటీకి ఫిర్యాదులు చేసినట్లయితే విధిగా రశీదులు ఇవ్వడంతో పాటు 90 రోజుల్లో న్యాయం చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం వంద రోజుల అవగాహన కార్యక్రమాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎంపీడీవో నరసింహారావు, ఐసీడీఎస్ సీడీపీవో ప్రభావతి, ఈవోపీఆర్‌డీ ధర్మారావు, ఎంఈవో కోటేశ్వరరావు, ఏసీడీపీవో శశికళ, ఆర్ఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీగణపతి ఆలయంలో హోమం


హోం జరుపుతున్న అర్చకులు

నక్కపల్లి, సెప్టెంబరు 11 : ఇక్కడి వీవర్స్ కాలనీలో ఉన్న విఘ్నేశ్వర ఆలయంలో బుధవారం లక్ష్మీగణపతి, లక్ష్మీ నరసింహ హోమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదపండితులు అప్పలాచార్యులు, శేషాచార్యులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ఈ వేడుకను జరిపారు. ఉపమాక వేంకటేశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి దంపతులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విద్యార్థులు బాసట


కలెక్టర్‌కు నగదు అందజేస్తున్న విద్యార్థులు

ఎలమంచిలి, సెప్టెంబరు 11 : విజయవాడ వరద బాధితులకు పలువురు విద్యార్థులు బాసటగా నిలిచారు. మునిసిపాలిటీ పరిధి కొక్కిరాపల్లి వార్డుకు చెందిన గ్రామ జ్యోతి విద్యార్థినీ విద్యార్థులు, ఎలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు కలిసి సుమారు రూ.73,270లను విరాళాలుగా సేకరించారు. అనంతరం ఈ అంశాన్ని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ దృష్టికి తీసుకు వెళ్లారు. ఆయన సూచన మేరకు జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌కు బుధవారం అందజేశారు. విద్యార్థులను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొర్లె నానాజీ, స్థానిక యువత పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలు విరాళం

అనకాపల్లి టౌన్ : విజయవాడ వరద బాధితుల సహాయార్థం అనకాపల్లి జీవీఎంసీ జోనల్ పరిధిలోని డ్వాక్రా సంఘాల మహిళలు రూ.లక్షా 800లు విరాళంగా ఇచ్చారని ఏపీడీ దొర తెలిపారు. డ్వాక్రా మహిళలు ఇచ్చిన ఈ విరాళాన్ని మెప్మా ఎండీ ద్వారా సీఎం సహాయ నిధికి అందజేస్తామని వివరించారు.

పౌష్టికాహారంపై అవగాహన సదస్సు


పోషకాహారంపై వివరిస్తున్న వైద్యాధికారి రమేష్

కశింకోట, సెప్టెంబరు 11 : అచ్చెర్ల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం ఆవశ్యకతపై బుధవారం అవగాహన సదస్సు ఏర్పాటైంది. తాళ్లపాలెం పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ రమేష్ హాజరై పోషకాహారం గురించి వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అందిస్తున్న సేవల గురించి తెలిపారు. డాక్టర్ ప్రసాద్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుచరిత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీహెచ్‌సీ వద్ద ఔట్‌సోర్సింగ్ సిబ్బంది నిరసన


సీహెచ్‌సీ వద్ద నినాదాలు చేస్తున్న సిబ్బంది

ఎలమంచిలి, సెప్టెంబరు 11 : ఇక్కడి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ముందు ఔట్ సోర్సింగ్ సిబ్బంది బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో నెంబరు 115ను రద్దు చేయాలని, తమ సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ అంశంపై ప్రభుత్వం వెంటనే స్పందించాల్సిందిగా కోరారు.

వేతన బకాయిల కోసం వలంటీర్లు ఆందోళన

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 11 : వలంటీర్ల వ్యవస్థను కొనసాగించాలని, బకాయి ఉన్న మూడు నెలల గౌరవ వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఇక్కడి జీవీఎంసీ జోనల్ కార్యాలయం ఎదుట వలంటీర్లు ధర్నా చేపట్టారు. అనంతరం జెడ్సీ అయ్యప్పనాయుడుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రామ వార్డు వలంటీర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు రాజానదొరబాబు, రాష్ట్ర అధ్యక్షుడు ఎం.జగదీష్ ప్రవీణ్, దివ్య, దేవి తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

అచ్యుతాపురం రూరల్, సెప్టెంబరు 11 : ఎయిడ్స్ హెచ్ఐవీపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ సూపర్‌వైజర్ టి.చంద్రశేఖర్ అన్నారు. స్థానిక క్రైట్స్ కళాశాల విద్యార్థులకు బుధవారం ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో ప్రమిళ, అంగన్‌వాడీ కార్యకర్త తదితరులు పాల్గొన్నారు.

టెన్నికాయిట్‌లో గురుకుల విద్యార్థి ప్రతిభ


అవినాష్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రామకృష్ణ


సబ్బవరం , సెప్టెంబరు 11 : స్థానిక గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి అవినాష్ టెన్నికాయిట్‌లో ప్రతిభ చూపాడు. మంగళవారం లంకెలపాలెంలో జరిగిన సబ్ జూనియర్ టెన్నికాయిట్ పోటీల్లో విశాఖపట్నం జిల్లా తరఫున విజయం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రామకృష్ణ బుధవారం అతనిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఈటీ వి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

'నిబంధనలకు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు పాతర'


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు చెన్నమూర్తి

కొత్తూరు, సెప్టెంబరు 11 : అనకాపల్లిలో నిబంధనలను పాటించిన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించి, చర్యలు తీసుకోవాల్సిందిగా సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు జొన్నకోట చెన్నమూర్తి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఇక్కడ జరిగిన సమావేశంలో మాట్లాడారు. అనకాపల్లి పరిసర ప్రాంతాల్లో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు పుట్టగొడుగుల్లా వ్యాపించాయన్నారు. ఇందులో కొన్నింటికి ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫికెట్ లేదని ఆరోపించారు. ఈ సెంటర్లలో టేస్టింగ్ సాల్ట్ విపరీతంగా వాడడం వల్ల ప్రజలు అనేక రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాసిరకం ఆయిల్, ప్రమాదకరమైన మసాలా పౌడర్లు, కెమికల్ కలర్‌లు మోతాదుకు మించి వాడుతున్నారన్నారు. ప్రజారోగ్యానికి ముప్పు కలిగించే వాటిపై తక్షణమే చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. ఈ సమావేశంలో సంఘం నేతలు చందాన కృష్ణ, రాజు, ద్వారపూడి కృష్ణ, బాల వరప్రసాద్, సుబ్బు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు


విద్యార్థులకు కంటి పరీక్షలు జరుపుతున్న వైద్యుడు

ఎస్.రాయవరం, సెప్టెంబరు 11 : పెదగుమ్ములూరు, గుడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో బుధవారం కంటి వైద్య శిబిరాలను నిర్వహించారు. ప్రభుత్వ కంటి వైద్య నిపుణులు డాక్టర్ బొండా వెంకటరావు ఆధ్వర్యంలో బృందం విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకు కూరలు, కూరగాయలు తినడం వలన కంటి సమస్యల బారినపడకుండా ఉండవచ్చని సూచించారు. కొందరు విద్యార్థులకు కంటి సమస్యలను గుర్తించామని, త్వరలో వారికి ఉచితంగా అద్దాలు పంపిణీ చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాచేరు డైవర్షన్ రోడ్డుతో పొలాలకు ముంపు బెడద

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 11 : భీమునిపట్నం-నర్సీపట్నం (బీఎన్) రోడ్డులో తాచేరు నదిపై నిర్మించిన డైవర్షన్ రోడ్డు నిర్మాణం కారణంగా పంటలు ముంపునకు గురవుతున్నాయని విజయరామరాజుపేట, వడ్డాదికి చెందిన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలకు గత ఏడాది బీఎన్ రోడ్డులో తాచేరుపై వంతెన దెబ్బతిన్న విషయం తెలిసిందే. దీంతో నిలిచిపోయిన రవాణా పునరుద్ధరణలో భాగంగా ఆర్ అండ్ బీ ఇంజనీరింగ్ అధికారులు తాత్కాలికంగా వంతెన పక్కన సీసీ పైపులు వేసి, దాని పై నుంచి డైవర్షన్ రోడ్డు నిర్మించారు. అయితే వంతెన వెడల్పునకు సరిసమానంగా సీసీ పైపులు వేయకపోవడంతో తాచేరు నది నీటి ప్రవాహం ఇరుపక్కలా ఉన్న పంట పొలాలను ముంచేస్తుంది. దీంతో వడ్డాది, విజయరామరాజుపేట గ్రామాలకు చెందిన సుమారు 25 ఎకరాల పంటలు దెబ్బతినడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నదీ ప్రవాహ సామర్థ్యానికి అనుగుణంగా సీసీ పైపులు సంఖ్య పెంచి పంటలు ముంపునకు గురికాకుండా తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.


వడ్డాదిలో నీట మునిగిన వరి పొలాలు

కింతాడ, అర్లి గ్రామాల్లో ఎంపీడీవో పర్యటన

కె.కోటపాడు, సెప్టెంబరు 11 : మండలంలోని కింతాడ, ఆర్లి గ్రామాలను గురువారం జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పర్యటించనున్నారు. దీంతో బుధవారం ఈ రెండు గ్రామాలను ఎంపీడీ వో సబ్బి అప్పలరాజు సందర్శించారు. పారిశుధ్య పరిస్థితిపై స్థానిక అధికారులకు సూచనలు చేశారు. కింతాడలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి అందులో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేయించారు. అలాగే ఆర్లి గ్రామంలో రోడ్లకు ఇరువైపులా పెరిగిన పొదలు, ముళ్ళ కంచెలను తొలగించాలని సంబంధిత పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ప్రసాద్, పలువురు ఇతర అధికారులు, టీడీపీ సీనియర్ నాయకులు కన్నూరు సూర్యనారాయణ పాల్గొన్నారు.


సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో అప్పలరాజు

పకడ్బందీగా 'ఉపాధి' సామాజిక తనిఖీలు

» ఎంపీడీవో చంద్రశేఖర్


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో చంద్రశేఖర్

దేవరాపల్లి, సెప్టెంబరు 11 : గ్రామాల్లో జరిగే ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీలను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో చంద్రశేఖర్ స్పష్టం చేశారు. బుధవారం ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో స్టేట్ రిసోర్సు పర్సన్ రాజేంద్రరావు, హౌసింగ్ ఏఈఈ తేజ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పనులు పునఃప్రారంభం

» నిధులు లేక నాలుగేళ్లుగా నిలిచిన పనులు » ఎమ్మెల్యే రాజు చొరవతో కదలిక

రావికమతం, సెప్టెంబరు 11 : గత నాలుగేళ్ళుగా నిలిచిపోయిన మండలంలోని గుడ్డిప గ్రామ దేవత భూలోకమ్మతల్లి ఆలయం, మండపం పనులు బుధవారం నుంచి పునర్ ప్రారంభమయ్యాయి. ఈ అమ్మవారి పాత గుడి శిథిలం కావడంతో అప్పట్లో గ్రామసులు చందాలుగా పోగుచేసుకొని అమ్మవారి గుడి, మండపం పనులు ప్రారంభించారు. ఆ నిధులు సరిపోకపోవడంతో పనులు నిలిచిపోయాయి. ఈ విషయాన్ని గ్రామ టీడీపీ నాయకులు మజ్జి అప్పారావు(కొండయ్య), గల్లా నానిబాబులు.. టీడీపీ మండల అధ్యక్షుడు రాజాన కొండనాయుడు ద్వారా ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు దృష్టి తీసుకెళ్ళారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి మండల పరిషత్ నిధులు ద్వారా ఆ గ్రామ ఎంపీటీసీ గంజి సూర్యనారాయణకు కేటాయించిన రూ.రెండు లక్షలను మంజూరు అయ్యేలా చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో ఆలయం, మండపం పనులు పునర్ ప్రారంభమయ్యాయి. దీంతో పాటు గ్రామస్థులు కూడా మరికొంత మొత్తాన్ని సమకూర్చి పనులు జరిగేలా చూస్తున్నారని స్థానికులు పిల్లా కృష్ణంనాయుడు, దొర్ల సత్యారావు, పిల్లా రమణ, తోట గోవిందరావు తదితరులు తెలిపారు.


ఆలయం, మండపాల పనులు ప్రారంభిస్తున్న గుడ్డిప గ్రామస్థులు

సీఎం రిలీఫ్ ఫండ్‌కు విరాళం


విరాళం అందజేసిన టీచర్లు, విద్యార్థులు

మాడుగుల రూరల్, సెప్టెంబరు 11 : భారీ వర్షాలకు కారణంగా విజయవాడ ముంపు ప్రాంతాల్లోని బాధితులకు సహాయం చేసేందుకు మండలంలోని కేజేపురం జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానికులు ముందుకు వచ్చారు. తమ వంతు సాయంగా రూ.10,902లు సీఎం సహాయ నిధికి అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం దాసు, పాఠశాల కమిటీ ఛైర్మన్ సంతోశ్‌కుమార్, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే.. మన్యపురట్ల చిత్తడే

నాతవరం, సెప్టెంబరు 11 : నాతవరం మండలం మన్యపురట్ల మెయిన్‌రోడ్డు వర్షం వస్తే చిత్తడిగా మారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మన్యపురట్ల మెయిన్‌రోడ్డు పక్కన కాలువలు లేకపోవడంతో వర్షం నీరు బయటకు వెళ్లే అవకాశమే లేకుండా పోతోంది. దీంతో రోడ్డుపై నీరు నిలిచిపోయి బురదగా మారుతోంది. దీనివల్ల వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా.. ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవతున్నారు. ఈ సమస్యపై అనేకసార్లు విన్నవించినా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించడం లేదంటూ గ్రామస్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరుతున్నారు.


బురదగా ఉన్న మన్యపురట్ల ప్రధాన రహదారి

80 పశువులకు టీకాలు


పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

రోలుగుంట, సెప్టెంబరు 11 : జాతీయ పశురోగ నివారణ కార్యక్రమంలో భాగంగా పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు కుసర్లపూడి పశువైద్యాధికారి సురేష్ తెలిపారు. బుధవారం మండలంలోని జె.నాయుడుపాలెంలో పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేశారు. అలాగే 4 నెలల నుంచి 8 నెలల వయస్సు గల ఆడ పెయ్యలకు బ్రూసెల్లోసిస్ టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 80 పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్ర సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక స్థాయి నుంచే డిజిటల్ బోధనతో సత్ఫలితాలు

» ఎంఈవో జగ్గారావు

రోలుగుంట, సెప్టెంబరు 11 : మండలంలోని జగ్గంపేట ఎంపీపీ పాఠశాలకు విద్యార్థులకు ఉపయోగపడే గూగుల్ టీవీని స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు బహూకరించారు. పాఠశాల హెచ్ఎం కాళింగ సతీష్, ఉపాధ్యాయురాలు భారతీ, స్థానిక యువత కలిసి రూ.35 వేలు విలువ చేసే టీవీని కొనుగోలు చేసి ఎంఈవో జగ్గారావు చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని, ప్రాథమిక స్థాయి నుంచే డిజిటల్ విధానంలో విద్యను అందిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. సాంకేతిక విద్యను చిన్నప్పటి నుంచే అందించేందుకు చేస్తున్న కృషిని అభినందించారు. పాఠశాల అభివృద్ధికి మరింతగా కృషి చేయాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బోడాపాత్రుని నరేష్, కె.జోగినాయుడు, ఎస్ఎంసీ ఛైర్మన్ ఆరిశెట్టి దేవి తదితరులు పాల్గొన్నారు.


స్మార్ట్ టీవీ అందజేస్తున్న ఉపాధ్యాయులు, స్థానిక నేతలు

మెగా వైద్య శిబిరం

చోడవరం, సెప్టెంబరు 11 : స్థానిక గణేశ గాయత్రీ బ్రాహ్మణ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు బ్రాహ్మణ సేవా ట్రస్టు ప్రతినిధులు ప్రకటించారు. బుధవారం పట్టణంలో గణేశ గాయత్రీ బ్రాహ్మణ సేవాట్రస్ట్ సభ్యులు ఉచిత మెగా కంటి వైద్యశిబిరం నిర్వహించారు.

ముఠా కార్మికులకు సమగ్ర చట్టం : సీఐటీయూ డిమాండ్


ఆందోళన నిర్వహిస్తున్న సీఐటీయూ నేతలు, కార్మికులు

నర్సీపట్నం, సెప్టెంబరు 11 : ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జికోటేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం ఎన్టీఆర్ మినిస్టేడియంలో ముఠా కార్మికుల సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసంఘటిత కార్మికులుగా ఉన్న ముఠా కార్మికులు నర్సీపట్నంలో 300 మంది హమాలీ పనులు చేస్తూ జీవిస్తున్నారని అన్నారు. ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేసి, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

గోవాడ షుగర్స్ మహాజన సభ 28న

... 5వ పేజీ తరువాయి

ప్రయత్నిస్తున్నామన్నారు. బుధవారం ఆరు వేల టన్నుల మొలాసిస్‌ను విక్రయించినట్టు తెలిపారు. వచ్చే సీజన్‌లో చెరకు రైతులకు త్వరితగతిన బకాయిలు చెల్లించేందుకు కృషి చేస్తామని ఆయన చెప్పారు. ఇథనాల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తే షుగర్ ఫ్యాక్టరీకి ఆదాయం పెరిగి, ఆర్థికంగా లాభదాయకంగా ఉంటుందని ఆయన తెలిపారు. దీనిపై ఇప్పటికే డీపీఆర్ తయారైందని. త్వరలో ప్రజాప్రతినిధుల సహకారంతో ప్లాంట్ ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తామని ఆయన వెల్లడించారు.

ఫార్మా ఉద్యోగి అదృశ్యం

... 5వ పేజీ తరువాయి

భార్య బాల మాట్లాడుతూ, డ్యూటీ ముగిసిన తరువాత తన భర్త ఇంటికి రాలేదని, పరిశ్రమలో అడిగితే ఇంటికి వెళ్లిపోయాడని చె బుతున్నారని, లోపల ఏదో ప్రమాదం జరిగి ఉండొచ్చనని, ఆ విషయాన్ని యాజమాన్యం దాచిపెడుతున్నదని ఆరోపించారు. తన భర్తకు ఏదైనా హాని జరిగితే యాజమాన్యమే బాధ్యత వహించాలని ఆమె స్పష్టం చేశారు.

పోలీసులకు ఫిర్యాదు, విచారణ

సూర్యనారాయణ అదృశ్యంపై కుటుంబసభ్యులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఆర్.మల్లికార్జునరావు ఫార్మా పరిశ్రమకు చేరుకుని యాజమాన్యంతో మాట్లాడారు. ఉద్యోగులను విడివిడిగా విచారించారు. సూర్యనారాయణ ఎలా ఉండేవారు, ఎవరితోనైనా గొడవలు ఉన్నాయా వంటి విషయాల గురించి ప్రశ్నించారు. కాగా సూర్యనారాయణ పరిశ్రమ నుంచి బయటకు వెళ్లినట్టు సీసీ ఫుటేజీలో రికార్డు కాకపోవడంతో అతను ప్రహరీ గోడ దూకి వెళ్లిపోయి వుంటాడని యాజమాన్య ప్రతినిధులు చెబుతున్నారు. కానీ సుమారు ఆరు అడుగుల ఎత్తు వున్న ప్రహరీ గోడను దూకే అవకాశం లేదని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. పోలీసులు అదృశ్యం కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాక్సింగ్ రింగ్‌కు బ్రేకులు

... 5వ పేజీ తరువాయి

టీడీపీ ప్రభుత్వ హయాంలో స్కేటింగ్ రింక్ ఏర్పాటు చేయడానికి అప్పుడు మంత్రిగా వున్న సీహెచ్ అయ్యన్నపాత్రుడు కృషి చేశారు. ఇక్కడ జిల్లా, రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలు నిర్వహించడానికి వీలుగా ఉంటుందని భావించారు. కాగా స్కేటింగ్ రింక్ ఆవరణలో ఉన్న స్థలంలో బాక్సింగ్ రింగ్, ఇండోర్ హాల్ నిర్మాణం చేయడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. దీంతో ఆర్అండ్‌బీ అధికారులు పనులు ఆపేశారు.

ఇతర ప్రాజెక్టులకు నిధులు మళ్లింపు

జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆధ్వర్యంలో మంగళవారం అనకాపల్లిలో స్పోర్ట్స్ అథారిటీ ప్రాజెక్టల మీద సమీక్షా సమావేశం నిర్వహించారు. కొత్తగా స్పోర్ట్స్ ప్రాజెక్టల ఆవశ్యకత, నిర్మాణంలో ఉన్న పనులపై సమీక్ష జరిగింది. నర్సీపట్నంలో నిలిచిపోయిన బాక్సింగ్ రింగ్, ఇండోర్ హాల్ నిధులను వేరే ప్రాజెక్టుకు ఉపయోగించాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. కాగా నర్సీపట్నంలో శిక్షణ తీసుకుంటున్న బాక్సింగ్ క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధిస్తున్నారు. బాక్సింగ్ రింగ్ ఉంటే శిక్షణకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. కానీ మైదానంలో ప్రాక్టీస్ చేసి, రింగ్‌లో పోటీ పడాలంటే ఇబ్బంది పడుతున్నారు. అందువల్ల బాక్సింగ్ రింగ్, ఇండోర్ హాల్‌ను మరోచోటైనా నిర్మించాలని క్రీడాకారులువిజ్ఞప్తి చేస్తున్నారు.


అటవీ అమరవీరులకు నివాళులర్పిస్తున్న సబ్ డీఎఫ్‌వో సునీల్‌కుమార్

అటవీ అమర వీరులకు నివాళులు

నర్సీపట్నం, సెప్టెంబరు 11 : జాతీయ అటవీ అమర వీరుల సంస్మరణ దినంలో భాగంగా అటవీ అధికారులు ర్యాలీ నిర్వహించారు. బుధవారం సబ్ డీఎఫ్‌వో సునీల్‌కుమార్ అమర వీరుల చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రేంజ్ అధికారి లక్ష్మీనర్సు, సూపరింటెండెంట్ మోహన్‌కృష్ణ, టెక్నికల్ ఆఫీసర్ శ్రీనివాసరావు, సబ్ డివిజన్, రేంజ్ సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేటలో ర్యాలీ..

కృష్ణాదేవీపేట : జాతీయ అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురష్కరించుకుని బుధవారం కృష్ణాదేవీపేట అటవీ కార్యాలయం నుంచి మెయిన్‌రోడ్డుపై భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అమరవీరులకు ముందుగా కార్యాలయం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో కృష్ణాదేవీపేట అటవీ రేంజ్ అధికారి సుంకర వెంకటరావు, స్థానిక డిప్యూటీ రేంజ్ అధికారి సత్యనారాయణ, గొలుగొండ సెక్షన్ అధికారి ఆర్.లక్ష్మణ్, గార్డులు సత్యనారాయణ, గౌరేసు, గణపతి , బేస్ కాంప్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


చోడవరంలో అమరులకు నివాళులు అర్పిస్తున్న అటవీశాఖ అధికారులు, ఉద్యోగులు

చోడవరంలో..

చోడవరం : అటవీ అమరుల దినోత్సవం బుధవారం స్థానిక అటవీశాఖ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీశాఖ రేంజ్ అధికారి పీవీ రవివర్మ అటవీ శాఖ అమరుల త్యాగాలను గుర్తు చేస్తూ వారి ఆశయాల సాధన అటవీ ఉద్యోగుల లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఉద్యోగులు అధికారులకు సిబ్బంది నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజి అధికారి జి. రాజగోపాల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎల్ పురంలో సీసీ రోడ్ల నిర్మాణం


రోడ్డ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ సుజాత

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 11 : గొలుగొండ మండలం ఏఎల్‌పురంలోని ఎస్టీ కాలనీ, అప్పికొండమ్మవీధిలో సీసీ రోడ్లు వేస్తున్నారు. ఈ ప్రాంతాల్లో ఇప్పటి వరకూ మట్టి రోడ్లు ఉండేవి. ఈ పనులకు సర్పంచ్ లోచల సుజాల బుధవారం శంకుస్థాపన చేశారు. 15 ఆర్థిక సంఘం నిధులు నుంచి 130 మీటర్లు పొడవైన రెండు సీసీ రోడ్లు పనులు చేపట్టనున్నారు. దీంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ పనులను మండల పీఆర్ జేఈఈ అరుణకుమారి, స్థానిక ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఝాన్సీ పర్యవేక్షించనున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రుత్తల రామకృష్ణ, చింతల బుల్లిప్రసాద్, ఉప సర్పంచ్ కొండతల్లి, అవినాశ్ పాల్గొన్నారు.

రక్తదానం సామాజిక బాధ్యత

» ఉత్తరాంధ్ర రక్తదాన ప్రచారకర్త వినోద్‌బాబు


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వినోద్‌బాబు తదితరులు

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 11 : రక్తదానం చేయడం ద్వారా ప్రాణాపాయస్థితిలో ఉన్న వ్యక్తి ప్రాణాలు నిలిచేలా చేయవచ్చని, అందుకే రక్తదానాన్ని సామాజిక బాధ్యతగా భావించాలని ఉత్తరాంధ్ర రక్తదాన ప్రచారకర్త వినోద్‌బాబు కోరారు. అక్టోబరు 2న అమ్మహార్ట్ హెల్పింగ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మెగా రక్తదాన శిబిరం గోడ పత్రికను ఆయన బుధవారం వడ్డాదిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వినోద్‌బాబు మాట్లాడుతూ 2022లో అమ్మహార్ట్ 678 యూనిట్ల రక్తసేకరణ చేపట్టగా, నేడు వెయ్యి యూనిట్ల రక్తసేకరణే లక్ష్యంగా ప్రజలను చైతన్యం చేస్తున్నామన్నారు. రక్తం అందక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారన్నా రు. ఈ కార్యక్రమంలో శిరిగిరిశెట్టి శ్రీరామూర్తి, దొండా గిరిబాబు, సయ్యపురెడ్డి నవీన్, దొండా నారాయణమూర్తి, గంట్రెడ్డి వెంకటేష్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న మేరీ సువార్త

నర్సీపట్నం రూరల్, సెప్టెంబరు : గర్భిణులు, బాలింతలు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం తీసుకోవాలని జడ్పీటీసీ సుకల రమణమ్మ పిలుపునిచ్చారు. బుధవారం ఐసీడీఎస్ అధికారి మేరీ సువార్త ఆధ్వర్యంలో మునిసిపాలిటీలోని పెదబొడ్డేపల్లి, వేములపూడి సెక్టార్ ధర్మసాగరంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యకరంగా బిడ్డకు జన్మనివ్వడం జరుగుతుందని తెలిపారు. అంగన్‌వాడీల నుంచి తీసుకు వెళుతున్న పౌష్టికాహారం వృథా చేయకుండా బాలింతలు, గర్భిణులు తప్పని సరిగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ధర్మసాగరం సర్పంచ్ గొంప కన్నయ్యనాయుడు, కౌన్సిలర్లు రాజులనాయుడు, బుల్లిదొర తదితరులు పాల్గొన్నారు.

☛ సంక్షిప్తంగా..

నేడు గెస్ట్ లెక్చరర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

దేవరాపల్లి, సెప్టెంబరు 11 : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ లెర్చరర్ల పోస్టులకు ఈ నెల 12న (గురువారం) ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ బి.రాధ తెలిపారు. బోటనీ లో 50 శాతం మార్కులతో పీజీ చేసిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. అలాగే వొకేషనల్‌కు సంబంధించి ఎం అండ్ ఏటీ ఉద్యోగం కోసం బీటెక్ (మెకానికల్)లో ఏభై శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ. పదివేలు వేతనం ఉంటుందన్నారు.

వినాయకుడి లడ్డూ రూ.1.4 లక్షలు


లడ్డూ దక్కించుకున్న లక్ష్మీనాయుడు

గొలుగొండ సెప్టెంబరు 11 : మండలంలోని పలు గ్రామాల్లో వినాయక నిమజ్జన కార్యక్రమాలు బుధవా రం ఘనంగా నిర్వహించారు. పలు చోట్ల సామూహికంగా లడ్డూకు వేలంపాటలు నిర్వహించారు. శ్రీరాంపురంలో నిర్వహించిన వేలంపాటలో వినాయకుడి లడ్డూను రాయపురెడ్డి లక్ష్మీనాయుడు రూ.1.4 లక్షలకు సొంతం చేసుకున్నారు. గొలుగొండ, జానకిరాంపురం, జోగంపేట, పాలకపాడు, చీడిగుమ్మల, కొత్తఎల్లవరం, కశిమి గ్రామాల్లో అన్నసమారాధన అనంతరం భారీ ఊరేగింపుతో నిమజ్జనాలు చేపట్టారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ర్యాలీ

దేవరాపల్లి, సెప్టెంబరు 11 : ఎస్సీ వర్గీకరణకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునర్ పరిశీలించాలని కోరుతూ పలు దళిత సంఘాల ఆధ్వర్యంలో ప్రతిఘటన ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌కు బుధవారం వినతి పత్రం ఇచ్చారు. కమిటీ మండల అధ్యక్షుడు కాటపల్లి అప్పారావు, నాగభూషణం, పరవాడ అప్పారావు, మల్లిబాబు పరశురాం తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు బ్రేక్

చోడవరం, సెప్టెంబరు 11 : పట్టణంలోని 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్వహణ పనులు చేపడుతున్నందున ఈనెల 13న (శుక్రవారం) పట్టణ పరిధిలోకి కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ ఏఈ కె.రాజు తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని 5 ఫీడర్లలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండబోదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ విజ్ఞప్తి చేశారు.

భారీగా అన్న సంతర్పణలు


మాకవరపాలెంలో అన్నదాన దృశ్యం

మాకవరపాలెం, సెప్టెంబరు 11 : మండలంలో వాయుపుత్ర యూత్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక ఉత్సవాల్లో భాగంగా బుధవారం మధ్యాహ్నం భారీ అన్నసంతర్పణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తామరం, మాకవరపాలెం గ్రామాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు.

దేవరాపల్లి : మండల కేంద్రంలో సెల్ పాయింట్ యూనియన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయకుడి వద్ద బుధవారం అన్న సమారాధన నిర్వహించారు. మాజీ ఎంపీపీ కిలపర్తి బాస్కరరావు, దేమున్నాయుడు అన్న సమారాధనను ప్రారంభించారు. కాటపల్లి రవి, లక్ష్మణ్, రవి, మురళి, నందు, సుందరరావు, అర్జున, శంకర్ పాల్గొన్నారు.


దేవరాపల్లిలో అన్నసమారాధన

వర్షాలకు కూలిన పెంకుటిల్లు


వర్షాలకు కూలిన ఇంటి ఎదుట నిర్వాసితుడు

నాతవరం, సెప్టెంబరు 11 : భారీ వర్షాల నేపథ్యంలో మండల కేంద్రంలోని ఎస్టీ కాలనీలో నివాసం ఉంటున్న నందిక తాతకు చెందిన పెంకుటిల్లు కూలిపోయింది. ఈ ఇంటిని వీఆర్వో బి.శ్రీనివాస్ పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్టు చెప్పారు. ఈ నేపథ్యంలో మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బంగారు సూరిబాబు మాట్లాడుతూ వర్షాలకు దెబ్బతిన్న ఇళ్లు, పంట నష్టాన్ని రెవెన్యూ అధికారులు త్వరితగతిన అంచనా వేసి బాధితులకు పరిహారం అందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈరూడి గంగరాజు, పొడుగు నాగరాజు, లోవ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన సదస్సు

మాడుగుల రూరల్, సెప్టెంబరు 11 : మండలంలోని కింతలి వల్లాపురం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పౌష్టికాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కింతలి పీహెచ్‌సీ వైద్యురాలు దివ్య గర్భిణులు, బాలింతలు రక్తహీనతకు గురి కాకుండా తీసుకోవాల్సిన పౌష్టికాహారం, ఆహారపు అలవాట్ల గురించి వివరించారు. ఆరోగ్యం విషయంలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ తాళ్లపురెడ్డి రాంబాయి, ఉప సర్పంచ్ గోవింద్, స్థానిక నాయకులు రాంబాబు, అంగన్‌వాడీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.